క్లుప్తంగా

హన్మంతునాయక్ విగ్రహం ఆవిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : మండలంలోని గాజీనగర్ వద్ద తండా మాజీ సర్పంచ్ నేనావత్ హన్మంతు నాయక్ విగ్రహాన్ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ నాయకులు వేమన్ రెడ్డి, దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వేణుధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు

దేవరకొండ : ఆర్టీసీ నల్లగొండ రీజియన్ పరిధిలో త్రైమాసిక ప్రగతిచక్ర అవార్డులను ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ శుక్రవారం నల్లగొండలో అందజేశారు. దేవరకొండ డిపోనకు చెందిన ఏడుగురు ఉద్యోగులు ఈ అవార్డులు అందుకున్నారు. నల్లగొండ రీజియన్ పరిధిలో దేవరకొండ ఉత్తమ బస్‌స్టేషన్‌గా అవార్డు దక్కించుకున్నట్లు డిపో మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు. రానున్న రోజుల్లో దేవరకొండ డిపోను రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. అవార్డులు దక్కించుకున్న ఉద్యోగులను.. అసిస్టెంట్ డిపో మేనేజర్ సైదులు, ఉద్యోగులు అభినందించారు.

టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



కిరణ్‌కుమార్

గుర్రంపోడు : తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కె.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కిరణ్‌కుమార్ ఎన్నికపై పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.గౌస్‌మెయినుద్దీన్, వద్దిరెడ్డి మధుసూదన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

డిండి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటరమణ అన్నారు. డిండి మండల పరిధిలోని గోనకొల్ గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 30న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కనకాచారి, ఎండీ.మైనొద్దీన్, బొల్లే శైలేష్, బొల్లే మంజుల, కళ్యాణ్, ప్రవీణ్, శ్రీకాంత్, వినయ్, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవంతీపురంలో పశు వైద్యశిబిరం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం అవంతీపురంలో శుక్రవారం గోపాలమిత్ర, పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలగడప పశు వైద్యాధికారి డాక్టర్ దుర్గా రమాదేవి మాట్లాడారు. పలు రకాల వ్యాధులు సోకిన గేదెలకు చికిత్స అందించినట్లు తెలిపారు. అలాగే 59 దూడలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేవీఓ వెంకటేశ్వర్లు, వీఏ శ్రీకాంత్, సుభాన, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎం. శివారెడ్డి, గోపాలమిత్రలు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకోవాలి

మిర్యాలగూడ : తన పట్టా భూమి నుంచి మట్టి తరలింపును అడ్డుకోవాలని దామరచర్ల మండలం రాళ్లవాగుతండాకు చెందిన రైతు ధీరావత్ మోతీరామ్ శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. స్థానిక పరిశ్రమ యాజమాన్యం మైనింగ్ అనుమతి తీసుకున్నది ఒక సర్వే నంబర్‌లో అయితే మరోచోట పట్టా భూమి నుంచి భారీగా మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ పట్టా భూమిలో మట్టిని తరలించడంపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరాడు.

విధుల బహిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : తమిళనాడు రాష్ట్రంలోని కృష్ణగిరి జిల్లా హోసూరులో నడిరోడ్డుపై న్యాయవాది కన్నన్ దారుణ హత్యను నిరసిస్తూ శుక్రవారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణారెడ్డి మాట్లాడారు. న్యాయవాదిని అతిదారుణంగా హత్య చేసిన నిందితుడు ఆనంద్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సకినాల వేలాద్రి, ఉపాధ్యక్షుడు స్వామి ప్రసాద్, కోశాధికారి పవన్‌కుమార్, న్యాయవాదులు అంజయ్య, లింగంపల్లి శ్రీనివాస్, సుధాకర్‌రావు, శ్రీనివాస్, రాంరంగారావు, ఎల్లయ్య, వేణుగోపాల్‌రావు, మంజునాథ్, సాయి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో ప్రజల బెంబేలు!

- దేవరకొండలో పట్టపగలే దొంగతనాలు
- భయాందోళనలో ప్రజలు
- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్



దేవరకొండ పట్టణంలో చోరీ జరిగిన ఓ ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న సీఐ (ఫైల్)

దేవరకొండ: పట్టణంలో ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస చోరీలు ప్రజలను కలవరపెడుతున్నాయి. గత మంగళవారం ఒక్క రోజే దేవరకొండ పట్టణంలో రెండు ఇళ్లల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. వారం రోజుల క్రితం అయ్యప్పస్వామి ఆలయం వెనుక జరిగిన ఘటన మరువకముందే.. దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్, జైపాల్ రెడ్డి కాలనీల్లో మంగళవారం పట్టపగలే వరుసగా రెండు ఇళ్లల్లో దొంగలు చోరీలు చేశారు. ఒక ఇంట్లో రూ.లక్షా 57వేలతోపాటు తులంన్నర బంగారం, మరో ఇంట్లో రూ.50 వేల నగదుతోపాటు బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవరకొండ పట్టణంలో పూలమొక్కలు విక్రయించే సూరిబాబు అనే వ్యక్తి సూపర్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనాన్ని బుధవారం తన ఇంటి పక్కన రోడ్డుపై నిలిపి ఉంచాడు. దాదాపు రాత్రి 7 గంటల ప్రాంతంలో అతడి వాహనం కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణంలో ఇటీవల చోటు చేసుకుంటున్న చోరీలతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

తాళం వేసి బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు

దేవరకొండ పట్టణంలోని పలు కాలనీల్లో గుర్తు తెలియని దుండగులు అదును చూసి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో ఏదైన పని నిమిత్తం పట్టపగలు సైతం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. వరుస చోరీలతో దేవరకొండ పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ నిర్వహించడంతోపాటు అనుమానాస్పద వ్యక్తుల పట్ల దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం



దేవరకొండ పట్టణంలో ఇప్పటికే పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. చోరీల నేపథ్యంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం. ప్రజలు కాలనీల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఎవరైనా ఇంటికి తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాలనుకుంటే పోలీసులకు తెలియజేయాలి. అంతే కాకుండా అనుమానాస్పద వ్యక్తులు కాలనీల్లో సంచరిస్తే తప్పనిసరిగా పోలీసులకు సమాచారం అందించాలి.

– నర్సింహులు, సీఐ, దేవరకొండ

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా

- ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి



వెంకటయ్యకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటానని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. హాలియా పట్టణంలోని ఆరవ వార్డుకు చెందిన శీలం వెంకటయ్య ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఆయనకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 60 వేల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే శుక్రవారం అందజేసి మాట్లాడారు. ఇటీవల సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ ద్వారా వెంకటయ్యకు మూడు లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గౌని సుధారాణి, కాంగ్రెస్ జిల్లా యువజన నేత రాజారమేష్ యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, సాగర్ మున్సిపల్ కౌన్సిలర్ రామకృష్ణ, నాయకులు పి.కృష్ణ, మురళికృష్ణ, యడవల్లి రంజిత్, హరిబాబు, నర్సింహా, మహేష్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి



సాగర్‌లో మాట్లాడుతున్న జానకిరెడ్డి

పెద్దవూర : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో కరీంనగర్ నుంచి వేములవాడ వరకు నిర్వహించనున్న పాదయాత్రకు జిల్లా నుంచి ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాయితి జానికిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె హిల్‌కాలనీలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ.25వేల పెన్షన్, ఉచిత బస్సుపాస్, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, హెల్త్‌కార్డు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు హీరేకార్ రమేష్‌జీ, కంచర్ల సుధీర్‌కుమార్, గుజ్జుల కొండలు, సిరికొండ మధు, పందిళ్ల సత్యనారాయణ, పాక శివ, నాగులు, చంద్రమౌళి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులను అందజేస్తున్న యాదయ్య

డిండి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డిండి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక నాయకులు యాదయ్య బహుమతులు అందజేశారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

దేవరకొండ : ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వర్షిత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు అనేక ఉద్యమాలు చేసిన కిషన్‌రెడ్డిని అవహేళన చేసి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేతావత్ లాలూనాయక్, వెంకట నారాయణరెడ్డి, చెనమోని రాములు, వానం నరేందర్‌రెడ్డి, అంకూరి నరసింహ, వస్కుల సుధాకర్, గుండాల అంజయ్య, పబ్బు సైదులు, రమేష్, అంజినాయక్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుర్రంపోడు : కొండమల్లేపల్లి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందునగుర్రంపోడు మండలంలోని పాల్వాయి, జూనూతుల, చేపూరు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలి

పెద్దవూర : మండల కేంద్రంలోని జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై వైజంక్షన్‌లో రహదారి విస్తరణలో భాగంగా ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలని శుక్రవారం నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిలకు పలువురు పెద్దవూర గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫ్లైఓవర్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్డును దుకాణాలు, ఇళ్లను ఆనుకుని ఫుట్‌పాత్ లేకుండా వేస్తుండటంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పురాతన గ్రామ దేవతల విగ్రహాలను, ఆలయాలను తొలగించటానికి కూడా అధికారులు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను గతంలో అనేకసార్లు అడ్డుకున్నామని, కోర్టుకు సైతం వెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై ఎంపీ రఘువీర్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరి, బాధితులు కర్నాటి పద్మారెడ్డి, పోలా సైదులు, కోట లక్ష్మయ్య, కాటేపల్లి వెంకటయ్య, బి.కొండారెడ్డి, బొలిగొర్ల శివ, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

త్రిపురారం : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. నిడమనూరు మండలంలోని పార్వతీపురం గ్రామానికి చెందిన తోట కోలయ్యకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం గ్రామంలో బాధిత కుటుంబానికి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



కలశం ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

త్రిపురారం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం అయ్యప్ప మహా పడిపూజను అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు వల్లపురెడ్డి జాన్ రెడ్డి, మెరుగు రాములు, రావర్తి ధనుంజయ, నల్లగొండ నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఈ పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. పడి పూజలో భాగంగా వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, ఆంజనేయ, వేంకటేశ్వర, రాములవారి స్వామి విగ్రహాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. 18 మెట్లు ఏర్పాటు చేసి జ్యోతులను వెలిగించారు. ముందుగా కలశ స్థాపన చేసి వీధుల్లో కలశం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాముల భక్తి గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు జీడికంటి నరేంద్రాచార్యులు, మాలధారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మారుమోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండలం నేతాపురం గ్రామంలో అయ్యప్పస్వామి మహా పడిపూజను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో పాటు అయ్యప్ప స్వాములు అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామ స్మరణతో గ్రామం మారుమోగింది. అయ్యప్ప స్వాములు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గురుస్వాములు బాసిరెడ్డి జానారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గాలి సైదిరెడ్డి, విజయ్, శివ, సీతారాంరెడ్డి, మురళియాదవ్, అయ్యప్ప, హనుమాన్, శివమ తదితర మాల స్వాములు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న టైం స్కూల్ యాజమాన్యం



విద్యార్థులను అభినందిస్తున్న లక్ష్య స్కూల్ అధ్యాపక బృందం

హాలియా : మహబూబాబాద్ జిల్లాల్లో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 నెట్‌బాల్ ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు హాలియాలోని టైం స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఐశ్వర్య, దత్తు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాల డైరెక్టర్ మంద నరేందర్‌రెడ్డి, కత్తి కోటిరెడ్డి, పీఈటీలు అభినందించారు.

హాలియా : నాగార్జునసాగర్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో లక్ష్య స్కూల్ విద్యార్థులు కావేరి, మంతా ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు సర్వనేని సతీష్, నాగండ్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనుముల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి రవి అభినందించారు.

మిర్యాలగూడ విద్యార్థి ప్రతిభ



సిల్వర్ మెడల్ అందుకుంటున్న అన్విత్ నిహాల్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన తమ్మనేని అన్విత్ నిహాల్‌రెడ్డి జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగిన 68వ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిథ్యం వహించి సిల్వర్ మెడల్ సాధించాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన నిహాల్‌రెడ్డిని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రశాంత్, పి.నవీన్ అభినందించారు. నిహాల్‌రెడ్డి మిర్యాలగూడలోని డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోచ్ ఎం.రామకృష్ణ వద్ద శిక్షణ పొందాడు. తరువాత హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నాడు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

మిర్యాలగూడ : పవర్‌ప్లాంట్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వైటీపీఎస్ సీఈ సమ్మయ్యకు వైటీపీఎస్ టీఆర్‌వీకేఎస్ రీజనల్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ మాట్లాడారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్మికుల, ఉద్యోగుల సౌకర్యార్థం అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. నైపుణ్యం గల వైద్యులను నియమించాలని కోరారు. అనంతరం సీఈ సమ్మయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రీజనల్ అధ్యక్షుడు మల్లెల వీరనారాయణ, కార్యదర్శి నాదెళ్ల రవికుమార్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, రాసూరి శ్రీనివాస్, బోదెడ్ల శ్రీనివాస్, ధర్మపురి నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌ఎంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కొండమల్లేపల్లి : నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు కట్టబోయిన శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొండమల్లేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు కొమిరె సైదులు, బద్దెల అంజయ్య, జనార్దన్‌రెడ్డి, సరస్వతి, శ్రీధర్, శ్రీను నాయక్, బాబు, యాదయ్య,మధు, నరేందర్, శోభారాణి, శ్రీదేవి, రాధిక, నీరజ, అనురాధ, పద్మప్రియ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

23న మాదిగల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న మాదిగ ఉద్యోగులు

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండలో ఈ నెల 23వ తేదీన నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి మాదిగలు కదిలిరావాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేగూరి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి స్థానికంగా జరిగిన డివిజన్ స్థాయి ఉద్యోగుల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ సైదులు, కత్తి అంజి, నాయకులు బచ్చలకూరి సైదులు, చిట్యాల జానయ్య, కోట విజయ్, ఈట నాగేందర్, సైదులు, సందీప్‌కుమార్, వెంకటేశ్వర్లు, దైద సత్యం, లక్ష్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ : మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న హెడ్ కుక్ పోస్టుకు మిర్యాలగూడకు చెందిన అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ లావూరి బాలు నాయక్ శుక్రవారం తెలిపారు. 45 ఏళ్లలోపు వయసు, 7వ తరగతి కనీస విద్యార్హత, వంట నైపుణ్యం కలిగి, మిర్యాలగూడలో నివాసం ఉండే మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 30లోపు మండల వనరుల కేంద్రంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

ఉపాధి, చేయూతపై మహిళలకు అవగాహన

వేములపల్లి : మండలంలోని గోపాలపురంలో శుక్రవారం ఇందిరా మహిళా శక్తి సంబురాలను నిర్వహించినట్లు ఏపీఎం బాషపాక చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో మహిళలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణబీమా, ప్రమాద బీమా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, యూనిఫాం తయారీ, డ్వాక్రా బజార్ ఏర్పాటు, బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం పలు అంశాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ స్వాగత్‌రావు, వీఓఏ పార్వతమ్మ, సైదమ్మ, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం చంద్రశేఖర్


కోటమైసమ్మకు మాజీ ఎమ్మెల్యే పూజలు



కోటమైసమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే భగత్

త్రిపురారం : నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామ పంచాయతీ పరిధిలో గల శ్రీకోటమైసమ్మ అమ్మవారిని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌యాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భగత్‌కు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. పూజారులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో పలువురు అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఝల్కారీబాయి జయంతి



ఝల్కారీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ : 1857 సిపాయి తిరుగుబాటులో ప్రముఖ పాత్ర పోషించిన భారతీయ మహిళా సైనికురాలు ఝల్కారీబాయి జయంతిని శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, సైదులు, వెంకటాచారి, కిషన్‌లాల్, సుగుణయ్య, లక్ష్మయ్య, నరసింహాచారి, యాదగిరి, వెంకటేష్, మల్లయ్య పాల్గొన్నారు.

సమావేశాలను జయప్రదం చేయాలి

దేవరకొండ : డిసెంబర్ 7, 8 తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండలోని సీపీఐ కార్యాలయంలో సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో మొగిళ్ల వెంగళయ్య, జూలూరి వెంకట్రాములు, కిన్నెర యాదయ్య, వలమల్ల బక్కయ్య, ఏషమోని గణేష్ తదితరులున్నారు.

వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని వాసవీ మాత ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష్మి, విష్ణు సహస్రనామాలు, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులు ఉసిరి చెట్టు కింద సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు సముద్రాల ధనయ్య, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి నరేందర్, కోశాధికారి కర్నాటి శ్రీనివాస్, ఊరె జనార్దన్, సంఘం ప్రతినిధులు కాంశెట్టి పాండరయ్య, చందా ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు